బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి రాజేశ్‌బాబు

నాగర్‌కర్నూల్, నవంబర్ 27 : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడలోని మహాత్మా జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కోనేరు స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టం 1929 బ్రిటీష్ కాలంలో అమలులోకి వచ్చిందని, ఈ చట్టంలో అనేక మార్పులు చేసిన కేంద్రం బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 లో తీసుకురావడం జరిగిందన్నారు. మైనర్లకు వివాహం చేసుకుంటే 1 లక్ష జరిమానా, రెండేళ్ళ జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. బాల్యవివాహాలను ఎవరైనా ప్రోత్సహించినా, కుదిర్చిన తల్లిదండ్రులూ శిక్షార్హులే అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి సబిత మాట్లాడుతూ.. చిన్నారులు చదువుపై దృష్టి పెట్టి మంచి విద్యా బుద్ధులు నేర్చుకొని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థితిలో స్థిరపడాలన్నారు. ఆడపిల్లలు ఎవరైనా ఆపద సమయంలో ఉన్నప్పుడు 100 నెంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, సంస్థ ప్రతినిధులు అంజనేయులు, సఖి సెంటర్ ఇన్‌చార్జి సునీత, ఉపాధ్యాయులు, పిల్లలు, సంస్థ సిబ్బంది, కోర్టు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల కష్టం.. దళారులు భోజ్యం
తూకంలో మోసంపై చర్యలేవీ..?

రైస్‌మిల్లులో ధాన్యాన్ని తూకంచేస్తున్న దృశ్యం (ఫైల్)

కోడేరు, నవంబర్ 27 : ఆరుగాలం కష్టించి రైతులు పడించిన పంటను మధ్యదళారులు తూకంలో మోసం చేస్తూ అక్రమాలకు పాల్పడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. మధ్యదళారుల ప్రమేయాన్ని అరికట్టి నేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా కూడా దళారుల అక్రమాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. రైతులు పండించి పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేక ఓ వైపు అన్నదాతలు ఆక్రందనలు పడుతుండగా దళారులు ప్రేవేట్ వ్యాపారులు మాత్రం వ్యాపారం చేస్తూ రైతులను నట్టేటముంచుతున్నారు. మండలంలోని బాడుగదిన్నెకు చెందిన బాలపీరు అనే రైతు వడ్లను సింగోటంలోని రైస్‌మిల్లుకు విక్రయించగా తూకంలో మోసం చేసిన వైనం బైటపడిన సంగతి పాఠకులకు విధితమే. కాని సంబంధితశాఖ అధికారులు మాత్రం ఆ రైతుకు జరిగిన అన్యాయంపై రైస్‌మిల్లు యజమానిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రెవెన్యూ సివిల్‌సప్లై అధికారులు ఏ మాత్రం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారనే అపవాదను మూటకట్టుకుంటున్నారని పలువురు అంటున్నారు. 85.20 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయిస్తే తూకంలో దండి కొట్టి కేవలం 62 క్వింటాళ్లుమాత్రమే ఉన్నాయని రైతును మోసం చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది.

బాధిత రైతు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైస్‌మిల్లు యజమాన్యంపై చర్యలు తీసుకొని రైతుకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కొల్లాపూర్ ఆర్ఐడీ స్వర్ణోత్సవాలు ప్రారంభం

సమావేశంలో పాల్గొన్న మంత్రి జూపల్లి తదితరులు

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 27 : పట్టణంలో రాజావారి బంగ్లాలో ఆర్ఐడీ స్వర్ణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, మైహోమ్ సంస్థల చెర్మన్ జూపల్లి రామేశ్వర్ రావు, శాస్త్రవేత్త రాంగోపాల్‌రావు, కొల్లాపూర్ సంస్థానాధీశుడు సురభీరాజా ఆదిత్య లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి వెలిగించి స్వర్ణోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో దాదాపువెయ్యిమంది వరకు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు దేశావిదేశాల్లో అనేక రంగాల్లో అభివృద్ధి చెంది నేడు తమ పూర్వపాఠశాల విద్యార్థులందరూ కలుసుకొని పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాని నిర్వాహకులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీచేసిన డీఎస్పీ

రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

పెద్దకొత్తపల్లి, నవంబరు 27 : మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ఆకస్మికంగా పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు క్రైరేట్ గురించి ఎస్సై సతీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారిపట్ల గౌరవంగా వ్యవరించాలని ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. మండలంలోని శాంతిభద్రతల పట్ల డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి

నాగర్‌కర్నూల్, నవంబర్ 27 : సైబర్‌నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి విద్యార్థులకు సూచించారు. బుధవారం తెలకపల్లిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, సెల్ ఫోన్ వాడకం, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. వివిధ యాప్‌లతో మీ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఆడపిల్లల్ని లైంగికంగా వేధిస్తుంటారని, విద్యార్థులు కేవలం భవిష్యత్తు మీదనే దృష్టి పెట్టాలని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా షీటీమ్‌ను సంప్రదిస్తే మీ సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 కానీ, 8712657676 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, ప్రిన్సిపాల్ రమ్మీ, షీటీమ్ బృందం వెంకటయ్య, భరోసా టీం జ్యోతి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీకి పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

తిమ్మాజిపేట, నవంబర్ 27 : మండలంలో ఒక కంపెనీలో డీజిల్ చోరీ చేసి పారిపోతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోతిరెడ్డిపల్లి సమీపంలోని హెచ్‌ఈసీ కంపెనీలో 400 లీటర్ల డీజిల్ కారులో తరలిస్తున్న నలుగురిని మంగళవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. వారినుంచి డీజిల్, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులు జడ్చర్ల సమీపంలోని ఉదం డాపుల్‌కు చెందిన వారుగా ఆయన తెలిపారు.

ఇసుక డంప్‌లు సీజ్

మొల్గరలో ఇసుక డంప్‌లను సీజ్‌చేసిన ఆర్ఐ

ఉప్పునుంతల, నవంబర్ 27 : మండలంలోని మొల్గర సమీపంలో అనుమతి లేకుండా నిల్వచేసిన ఆరు ఇసుకడంప్‌లను బుధవారం సీజ్ చేసినట్లు తాసీల్దార్ ప్రమీల తెలిపారు. మామిళ్లపల్లికి చెందిన మోహన్‌గౌడ్ దుందుభీ వాగు నుంచి టిప్పర్లతో ఇసుకను డంప్ చేసినట్లుగా తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తినష్టం

లింగాల, నవంబర్ 27 : షాట్ సర్క్యూట్‌తో దాదాపు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిన ఘటన మండలంలోని సూరాపుల్‌లో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. జల్లెల శంకర్ తన భార్యతో కలిసి ఆరుబయట నల్లానీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు ఇంట్లో నుంచి పొగలు వచ్చాయి. వెళ్లి చూడగా మంటలు వ్యాపించినట్లు తెలిపారు. మంటలను ఆర్పే సరికి ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, దుస్తులు, తిండి గింజలు కాలిబూడి డైపోట్లు తెలిపారు. కాలిపోయిన సామగ్రి విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందన్నారు. ఘటనకు సంబంధించి తాసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, ఎంఆర్ఐ అనీల్ ఘటనా స్థలాన్ని సందర్శించి పంచానామ నిర్వహించారు.

విద్యుదాఘాతంతో కాలిపోయిన సామగ్రి

ఉరేసుకొని వ్యక్తి మృతి

వెల్దండ, నవంబర్ 27 : మండలంలోని కొత్రగ్రామానికి చెందిన మాడ్గుల నరేశ్(28) అనే యువకుడు హైదరాబాద్‌లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్ గతకొంత కాలంగా హైదరాబాద్‌లోని పీఅండ్‌టీ కాలనీలో నివాసముంటూ డెకరేషన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్న నరేశ్ అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున కుటుంబసభ్యులు లేచి చూసేసరికి నరేశ్ మృతి చెంది ఉన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం కొత్రకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య ప్రియాంక, కుమారుడు ఉన్నాడు.

బేసిక్‌పే అమలుచేయాలి

- భోజన విరామంలో సమయంలో నిరసన

నాగర్‌కర్నూల్ కస్తూర్బాలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నాగర్‌కర్నూల్, నవంబర్ 27 : బేసిక్‌పే అమలుచేయాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలోని నాగర్‌కర్నూల్, తెలకపల్లి, తాడూరు మండలాల్లోని కస్తూర్బా విద్యాలయాల్లో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన దశలవారి పోరాటంలో భాగంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలు సందర్శించి నిరసనలో పాల్గొన్న జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, శ్రీధర్ మాట్లాడుతూ.. అనాథ, పాక్షిక అనాథ, పేదబాలికలకు కేజీబీవీలలో ఆవాస విధానంలో నాణ్యమైన బోధన అందజేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న ఉపాధ్యాయినులకు ప్రత్యేకాధికారులకు, ఉద్యోగులకు సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కనీస మూలవేతనం బేసిక్‌పే అమలుచేయాలని డిమాండ్ చేశారు. వారిని క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకమిటీ సభ్యులు చిన్నయ్య, ఆడిట్‌కమిటీకన్వీనర్ వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లాల పూర్వ అధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

తాడూరు కస్తూర్బాలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సర్వేలో ఉపాధ్యాయులకు విధుల కేటాయింపు తగదు

కోడేరులో కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న అధికారులు.

కల్వకుర్తి రూరల్, నవంబర్ 27 : సమగ్ర కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులకు విధులను కేటాయించడం సరైంది కాదని టీయూటీఎఫ్ జిల్లాఅధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌరవాధ్యక్షుడు పోషయ్యలు బుధవారం అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 20 రోజులుగా సర్వే ఎన్యుమరేషన్‌లో విధులు నిర్వహించడంతో పాఠశాలలో బోధనకు ఆటంకం ఏర్పడి విద్యార్థులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం సర్వే ఉపాధ్యాయులతో సర్వే చేయించడం వల్ల తల్లితండ్రుల నుంచి విమర్శలు వస్తున్నాయన్నారు.

దరఖాస్తుల కంప్యూటరీకరణ పరిశీలన

కోడేరు, నవంబర్ 27 : మండలపరిషత్ కార్యాలయంలో సమగ్ర ఇంటింటిసర్వే దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను బుధవారం మండల ప్రత్యేకాధికారి సుధాకర్‌సింగ్ పరిశీలించారు. ఆయాగ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి సర్వేను నిర్వహించారు. బుధవారం అధికారులు పరిశీలించి వేగవంతంగా చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, తాసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తప్పుల్లేకుండా డేటా ఎంట్రీ చేయాలి

వెల్దండ, నవంబర్ 27 : సమగ్రకుటుంబ సర్వే డేటా ఎంట్రీ చేయడంలో ఎలాంటి తప్పుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం, ఎమ్మార్సీ భవనంలో సర్వే డాటా ఎంట్రీ సెంటర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గురుస్వామి

తాడూరు, నవంబర్ 27 : ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కల్పించాలని ఎస్సై గురుస్వామి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కూచకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఫోన్లు, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటివి వాడినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, తల్లిదండ్రుల ఫోన్లను ఇష్టానుసారంగా వినియోగించుకుంటూ అవగాహన లేకపోవడంతో ఫోన్‌కు వచ్చే మెస్సేజ్‌ల వల్ల అకౌంట్లలోని డబ్బులు ఖాళీ అవుతాయన్నారు. ఇలాంటి విషయాల్లో విద్యార్థులు అవగాహన కలిగి ఉండి తమ తల్లిదండ్రులకు, తెలియని వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

యోగా చేస్తున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బిజినేపల్లి, నవంబర్ 27 : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆయూష్ జిల్లా ప్రోగ్రాం అధికారి సురేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖానలో యోగాను ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో యోగాను నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ప్రజలు రోగనిరోధకశక్తి పెంచుకునేందుకు యోగాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శివకుమార్, జహంగీర్, శివతేజ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

బిజినేపల్లి, నవంబర్ 27 : డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించబోయే మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణను బుధవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభకు అధికమొత్తంలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ పాదయాత్ర ద్వారా వస్తున్నందున అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మహేశ్, నిరంజన్, శివ, విజయ్, శ్రీకాంత్, బాల్‌రాజు, స్వామి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

ఎస్టీజీ ఉపాధ్యాయురాలికి సన్మానం

బల్మూరు, నవంబర్ 27 : మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని రేణుకకు ఇటీవల ఎస్టీజీటీ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. దీంతో ప్రిన్సిపాల్ రవి, అధ్యాపకులు బుధవారం రేణుకను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, మల్లయ్య, నర్సింహ్మారావు, లక్ష్మణ్, అశోక్‌కుమార్, గాయత్రి, నర్సింహులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

బల్మూరు, నవంబర్ 27 : 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతిఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని తాసీల్దార్ శ్రీకాంత్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ వరకు కొత్త ఓటరు నమోదుకు అవకాశముందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీపీఎం జిల్లామహాసభలను జయప్రదం చేయండి

నాగర్‌కర్నూల్, నవంబర్ 27 : డిసెంబర్ 14,15 తేదీల్లోనిర్వహించనున్న భారత కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్ట్ సీపీఎం 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రామయ్య పిలుపునిచ్చారు.జిల్లాలోని కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

సన్మానానికి క్రైస్తవులు దరఖాస్తులు చేసుకోవాలి

నాగర్‌కర్నూల్, నవంబర్ 27 : క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో ఎంపిక చేయబడిన అర్హులైన క్రైస్తవ అభ్యర్థులు గౌరవ సన్మానించేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి గోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత పదేండ్లుగా సామాజిక సేవా, మెడిసిన్, విద్య, లిటరేచర్, ఫైన్‌ఆర్ట్స్, థియేటర్, స్పోర్ట్స్ వంటి రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సన్మానానికి అర్హులన్నారు. 30ఏండ్ల కంటే తక్కువ కాకుండా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవారంగాల్లో క్రైస్తవ సంస్థలు సన్మానం పొందేందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి క్రిస్మస్ సందర్భంగా రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సన్మానిస్తారన్నారు. పూర్తిచేసిన నామినేషన్లను కలెక్టరేట్ భవనంలో రూమ్‌నెంబర్ ఎస్-25లో డిసెంబర్5వ తేదీ వరకు స్వీకరిస్తారన్నారు.

ఆలయాలకు బెంచీలు వితరణ

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 27 : కొల్లాపూర్‌లో వివిధ ఆలయాలకు హైదరాబాద్ చెందిన డా॥పద్మజ సంతాన సాఫల్య కేంద్రం ఆధ్వర్యంలో బెంచీలను వితరణ చేశారు. మండలంలో రామాలయం, శివాలయం, మాధవ స్వామి, శ్రీకృష్ణ భగవత్‌గీత మందిరం, జమ్మిచెట్టు వద్ద, కొడేర్ మండలం ఎత్తం రామాలయం, అభయాంజనేయస్వామి , సోమశిలలోని రామాలయం, శివాలయంలో సిమెంట్ బెంచీలను భక్తులసౌకర్యం కోసం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మజ కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

కొల్లాపూర్ రూరల్, నవంబర్ 27 : ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలను గురువారం వేలం వేస్తారని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి రూ.5వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిమ్మాజిపేట, నవంబర్ 27 : మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పునరుత్పాదక ఇంధనం అనే అంశంపై నిర్వహించిన పోటీలలో అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం రాసిన ముగ్గురిని ఎంపిక చేశారు. సరిత,శ్రీధర్,నజిరీన్ ఫాతీమాలను విజేతలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ జెట్టి పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్వకుర్తి రూరల్, నవంబర్ 27 : మండలంలోని తర్నికల్‌లో పీఏసీసీఎస్ వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారీలను ఆశ్రయించకుండా వరి కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ వైస్‌చైర్మన్ శ్యామ్ రైతులు శ్రీను, శ్రీశైలం, కొండల్ రెడ్డి, ప్రభాకర్,వెంకట్, సుల్తాన్, ఈశ్వర్ రెడ్డిఉన్నారు

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఆర్‌డీవో

వంగూరు, నవంబర్ 27 : మండలంలోని సర్వారెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఓబులేశు సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పండి తావు, ఏపీఎం చంద్రయ్య, ఏపీవో శివశంకర్ గౌడ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల, నవంబర్ 27 : రైతులు కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సింగిల్ విండో చైర్మన్ హన్మంతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జీలుగుపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీవో పాండు, రైతులు పాల్గొన్నారు.

వడ్లల్లో తేమశాతం 17కు మించరాదు

పెద్దకొత్తపల్లి, నవంబరు 27 : వడ్లల్లో తేమశాతం 17శాతానికి మించరాదని ఏఈవో అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ముష్టిపల్లిలో ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. తేమశాతం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

భోజనంలో నాణ్యతలోపిస్తే చర్యలు

కల్వకుర్తిలో ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీను

ఉప్పునుంతల, నవంబర్ 27 : విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం ఉప్పునుంతల కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించకుండా పరిశుభ్రత పాటించాలని ఎస్‌వో సైదాకు సూచించారు.

కస్తూర్బా గాంధీ పాఠశాల తనిఖీ..

లింగాల, నవంబర్ 27 : విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్య మైనభోజనాన్ని అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌వో శారద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో

కల్వకుర్తి రూరల్, నవంబర్ 27 : మండలంలోని రఘుపతిపేటలో ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆర్డీవో శ్రీను ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వసతిగృహాన్ని సందర్శించి వసతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో స్టాక్‌రూంలో ఆహార వస్తువులను పరిశీలించారు. సరఫరా అయిన వస్తువులను వాటి ఎక్స్పైరీ డేట్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న పుస్తకాలు, నోట్స్, దుప్పట్లు, కూరగాయలు, గుడ్లు నిల్వ చేసిన వస్తువులు, మెస్‌చార్జీలు పలుఅంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట అధికారులు హరీందర్‌రెడ్డి, ఆర్ఐ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వెల్దండ, నవంబర్ 27 : విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తాసీల్దార్ కార్తీక్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంట సరకులు,